క్లుప్తంగా

గిరిజన విద్యార్థికి డాక్టరేట్



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న కరంటోతు మోతీలాల్

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం పంతులుతండాకు చెందిన గిరిజన విద్యార్థి కరంటోతు మోతీలాల్ గ్లోకల్ యూనివర్సిటీ ఢిల్లీ నుంచి డాక్టరేట్ పొందారు. అనాలసిస్ ఆఫ్ ఫ్లెక్సిబుల్ ఫిక్చర్ సెటప్ అండ్ ఆప్టిమైజేషన్ బిఫోర్ మిల్లింగ్ ఆపరేషన్‌పై పీహెచ్‌డీ చేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీత మాట్లాడారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో డాక్టరేట్ పొందడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. అవార్డు పొందడంపై తండావాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏఎంసీ చైర్‌పర్సన్‌గా శ్వేత



నల్లనాగుల శ్వేత, చైర్ పర్సన్



జీవన్‌రెడ్డి వైస్ చైర్మన్

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా జనగాం జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరుకు చెందిన నల్లనాగుల శ్వేతను నియమితులయ్యారు. కాగా, 18 మందితో నూతన కమిటీ ఏర్పాటైంది. వైస్ చైర్మన్‌గా మద్దూరు మండలం సలాక్‌పూర్‌కు చెందిన కే జీవన్‌రెడ్డి నియామకమయ్యారు. డైరెక్టర్లుగా ఇర్రి రాంరెడ్డి, ఆసర్ల అంజయ్య, అర్జుల పోషిరెడ్డి, వంగ కృష్ణారెడ్డి, భేతి శ్రీనివాస్, ధరావత్ లక్ష్మి, సింగపాక కుమార్, చల్ల అండాలు, బండారి కనకయ్య, బైరగోని భాను ప్రకాశ్, పాల లక్ష్మీనారాయణ, తడక లింగమూర్తి, గౌరవ సభ్యులుగా పీఏసీఎస్ చైర్మన్ (నర్మెట), జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ (సిద్దిపేట), ఏడీఏ(చేర్యాల), మున్సిపల్ చైర్‌పర్సన్ (చేర్యాల) నియమితులయ్యారు. సిద్దిపేట జిల్లా పరిధిలోని చేర్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా జనగామ జిల్లా మహిళను నియమించడంపై స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

పేకాట స్థావరంపై దాడులు

ఐదుగురు జూదరులపై కేసు నమోదు

సిద్దిపేటకమాన్: పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు జూదరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పట్టణంలోని బాలాజీ గార్డెన్ సమీపంలో కొంతమంది వ్యక్తులు పేకాట ఆడుతున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, వన్ టౌన్ పోలీసులు శుక్రవారం వెళ్లి దాడులు చేశారు. పేకాట ఆడుతున్న పట్టణానికి చెందిన నక్కల దామోదర్, బండి రాజు, బానోజి నర్సయ్య, బొమ్మన రాజేశ్వరరావు, మహమ్మద్ రహీమ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.7,700 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్ టౌన్ సీఐ లక్ష్మీబాబు తెలిపారు. ఎక్కడైనా పేకాట, జూదం ఆడుతున్నట్లు సమాచారం తెలిస్తే టాస్క్‌ఫోర్స్ 87126-67445 నంబర్‌కు సమాచారం తెలపాలని సూచించారు. కార్యక్రమంలో టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ సాయిప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం కేసులో నిందితుడి అరెస్టు

సిద్దిపేటకమాన్: పెళ్లి చేసుకుంటానని యువతిని మోసం చేసిన ఘటనలో నిందితుడిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. హుస్నాబాద్ ఎల్లమ్మబజార్‌కు చెందిన జాలిగాం శ్రీనివాస్ (24) ప్రైవేటు ఉద్యోగిగా పని చేస్తున్నాడు. పట్టణానికి చెందిన యువతితో ఇన్‌స్టాగ్రాంలో పరిచయమైంది. ఆ మేరకు ఒక రోజు తనను ప్రేమిస్తున్నానని వివాహం చేసుకుంటానని నమ్మించి లొంగదీసుకున్నాడు. ఇటీవల పెళ్లి మాట ఎత్తితే పట్టించుకోవడం లేదు దీంతో మోసపోయానని తెలుసుకున్న బాధితురాలు గత నెల 23న టూటౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు అత్యాచారం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

వన మహోత్సవంలో భాగస్వామ్యం కావాలి

గజ్వేల్: వనమహోత్సవంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి పిలుపునిచ్చారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలో ఉన్న పలు వార్డుల్లో ఇంటింటికీ మొక్కలు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడమే పరిష్కారమన్నారు. ఈ కార్యక్రమాన్ని అందరూ విజయవంతం చేయాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలో విరివిగా మొక్కలను పంపిణీ చేస్తున్నామన్నారు. వాటిని నాటి పరిరక్షించాలని కోరారు. ముందుగా డ్రై డే నిర్వహించి పలు చోట్ల నిల్వ ఉన్న నీటిని తొలగించారు. మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, కౌన్సిలర్లు బాలమణి, వరలక్ష్మీకనకయ్య, రజిత, రహీం, ఏతి శ్రీధర్‌రెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

నడిచేదెలా..



ఇబ్రహీంనగర్‌లో రోడ్డుపై గుంతల్లో నిలిచిన నీరు

చిన్నకోదూరు మండలం.. ఇబ్రహీంనగర్ బీసీ కాలనీ రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతుంది. నీరు నిలిచి ఉండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు ద్వారా మోడల్ స్కూల్‌కు విద్యార్థులు వెళ్తారు. ఈ రకంగా రోడ్డంతా బురద, గుంతల మయంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. – చిన్నకోదూరు(సిద్దిపేట)



గౌరవెల్లి ప్రధాన రహదారి దుస్థితి

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గౌరవెల్లి గ్రామ ప్రధాన రహదారి అనేక చోట్ల గుంతలు పడి అందులో నీరు నిలుస్తోంది. దీంతో వాహనదారులు, కాలినడక సాగించే వారు అవస్థలు పడుతున్నారు. కాలు తీసి కాలు మోపడం కష్టంగా మారింది. ఎక్కడ గుంత ఉందో అర్థం కాక ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – అక్కన్నపేట(హుస్నాబాద్)

మానవత్వం పరిమళించే..



వ్యక్తిని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకు వచ్చిన సీఐ శ్రీను

చేర్యాల సీఐ ఎల్.శ్రీను మానవత్వం చాటుకున్నారు.. రోడ్డుపై పడిపోయిన వ్యక్తిని ఆస్పత్రికి తరలించారు . కిష్టంపేటకు చెందిన బీ తిరుపతిరెడ్డి శుక్రవారం వ్యక్తిగత పనులపై చేర్యాలకు వచ్చాడు. మార్కెట్ సమీపంలో ప్రధాన రహదారిపై మూర్ఛతో కింద పడిపోయాడు. అటుగా వెళ్తున్న సీఐ వెంటనే వాహనాన్ని ఆపి అందులో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. – చేర్యాల(సిద్దిపేట)

దుకాణ సముదాయాన్ని ప్రారంభించేదెన్నడో?

వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో ప్రధాన రహదారి వెంట 20 షాపుల గల కాంప్లెక్స్‌ను ప్రారంభించడం లేదు. స్థానిక రాజకీయాలే అందుకు కారణమని తెలుస్తోంది. పనులు కూడా పూర్తయి కొన్ని నెలలు గడుస్తున్నాయి. అయితే అద్దె ద్వారా మార్కెట్‌కు ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యం నీరుగారుతోంది.



మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మించిన కాంప్లెక్స్

నీరుగారుతున్న లక్ష్యం

చేర్యాల(సిద్దిపేట): మార్కెట్ యార్డుకు శాశ్వత ఆదాయం సమకూర్చాలన్న లక్ష్యంతో గత ప్రభుత్వ హయాంలో అప్పటి పాలకవర్గం 20 షాపుల నిర్మాణానికి తీర్మానించింది. అప్పటి మంత్రి హరీశ్ రావు, మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డిల సహకారంతో రూ.1.50 కోట్లు మంజూరు చేయించారు. 2022 ఏప్రిల్ 6న శంకుస్థాపన చేసి నిర్మాణ పనులు ప్రారంభిస్తే అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులు పూర్తయ్యాయి. అప్పుడు ఎన్నికలు ఉండటంతో ప్రారంభించలేదు. ఇవి ముగిసి ఫలితాల అనంతరం కూడా ప్రారంభానికి నోచలేదు. నూతనంగా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైనా అధికారులు కార్యక్రమాన్ని ఎందుకో అర్ధాంతరంగా నిలిపేశారు.

ఫుల్ డిమాండ్

మున్సిపాలిటీ కావడంతో రోజురోజుకూ ఈ ప్రాంతం విస్తరిస్తోంది. మార్కెట్ యార్డుకు సమీపంలోనే తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాలు, ఇంటిగ్రేటెడ్ కాంప్లెక్స్ భవనం కూడా నిర్మాణం జరుగుతోంది. దీంతో మార్కెట్ యార్డు ఆవరణలో నిర్మించిన షాపులకు గిరాకీ ఉండనుంది. ఒక్కో షాపునకు నెల అద్దె రూ.4 నుంచి 5వేలు పలికే అవకాశముంది.

వేలం వేసి కేటాయిస్తాం



మార్కెట్ యార్డు ఆవరణలో చేపట్టిన 20 షాపుల నిర్మాణ కాంప్లెక్స్ పనులు ఇటీవలే పూర్తయ్యాయి. విద్యుత్ మీటర్ల కోసం సంబంధిత అధికారులను సంప్రదించాం. త్వరలోనే అమరిస్తే.. వ్యవసాయ మార్కెట్ జాయింట్ డైరెక్టర్ ఆధ్వర్యంలో బహిరంగ వేలం ద్వారా దుకాణాలను కేటాయిస్తాం.

– గ్యాదరి పరమేశ్వర్, మార్కెట్ కార్యదర్శి

దీంతో పాటు అంగడి బజారులోని మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ కూల్చివేత, జాతీయ రహదారి విస్తరణ పనులు, మున్సిఫ్ కోర్టు మంజూరు కూడా డిమాండ్‌కు కారణం కావొచ్చన్న అభిప్రాయం వినిపిస్తోంది. కాగా, రాజకీయ కారణాలు.. ప్రారంభోత్సవానికి అడ్డుపడుతున్నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అయితే ప్రభుత్వం, అధికారులు, అధికార పార్టీ నాయకులు వెంటనే స్పందించి ప్రారంభించాలని కోరుతున్నారు.

అమ్మా... బైలెల్లినాదో

- నేటి నుంచి మహంకాళమ్మ ఉత్సవాలు
- బోనాల ఊరేగింపు ప్రత్యేకం
- హాజరు కానున్న ప్రజాప్రతినిధులు, ప్రముఖులు



మహంకాళమ్మ ఆలయం

దుబ్బాక: భక్తుల కోర్కెలను నెరవేర్చే మహిమ గల తల్లిగా పట్టణంలో కొలువైన మహంకాళమ్మకు పేరుంది.. ఆషాఢ మాసం కావడంతో అమ్మవారికి బోనాలు తీయడం ఓ ప్రత్యేకత. ఆకులు, పువ్వులు, పండ్లతో అలంకరరణ, పూజించి బోనాలను సమర్పిస్తే కరువుకాటకాలు ఉండవంటారు. వానలు కురిపించి పాడి పంటలను ప్రసాదిస్తుందని ప్రజలు నమ్ముతారు. ఇందులో భాగంగా శనివారం మాతకు బోనాలు తీసేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. పట్టణంలోని రెడ్డి సంఘాలు, మున్నూరు కాపు సంఘం తోపాటు పలు సంఘాలకు చెందిన వారు బోనాలు తీస్తారు. సాయంత్రం 4 గంటలకు ఇంటికి రెండు బోనాల చొప్పున బయలుదేరుతారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాల మధ్య ప్రధాన వీధుల గుండా బోనాల ఊరేగింపు అమ్మవారి ఆలయానికి చేరుకుంటుంది.

ప్రజాప్రతినిధులు, ప్రముఖుల రాక

మహంకాళమ్మ ఉత్సవాల సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేదపండితులు వేలేటి జయరామశర్మ, రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో వైదిక నిర్వహణ జరుగుతుంది. ఆలయం వద్ద భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు, మున్సిపల్ చైర్ పర్సన్ గన్నె వనిత భూంరెడ్డి, పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు.



అమ్మవారు

అన్ని ఏర్పాట్లు చేశాం



మహంకాళమ్మ ఉత్సవాల సందర్భంగా ఆలయం వద్ద అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయాన్ని సుందరంగా తీర్చిదిద్దాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూసుకుంటాం.

– మల్లుగారి నర్సింహ్మారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

సీజనల్ వ్యాధులపై అవగాహన

మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి

సిద్దిపేటజోన్: వానాకాలం నేపథ్యంలో ప్రజల్లో సీజనల్ వ్యాధులు, నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ ప్రసన్న రాణి.. సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం స్థానిక 11వ వార్డు కాళ్ల కుంట కాలనీలో డ్రై డే సందర్భంగా ఇంటింటికి వెళ్లి పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. పలు ప్రాంతాల్లో నిల్వ నీరు ఉండటం పట్ల సిబ్బందికి, వార్డు మహిళలకు సూచనలు చేశారు. మలేరియా, డెంగీ లాంటివి ప్రబలకుండా జాగ్రత్తగా ఉండాలన్నారు. ఇళ్లలోని పూలకుండీల్లో నీరు నిల్వ ఉండకూడదన్నారు. దోమల నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. వార్డులో సమస్యలపై ఆరా తీశారు. నీటి సరఫరా, చెత్త సేకరణ వాహనం పనితీరు, పారిశుద్ధ్య పనులు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వార్డులో ఫాగింగ్ చర్యలు చేపట్టాలని సూచించారు. రోజూ తప్పనిసరిగా వార్డులో ఇంటింటికి వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితి తెలుసుకొని, మలేరియా, డెంగీ, సీజనల్ వ్యాధులు వచ్చిన వారి సమగ్ర వివరాలను సేకరించాలన్నారు. ముందుగా హరిత శుక్రవారంలో భాగంగా మొక్కలకు నీరు పట్టారు. ప్రతి ఒక్కరూ మొక్కలను కాపాడే సామాజిక బాధ్యత తీసుకోవాలని సూచించారు. ఆమె వెంట మున్సిపల్ కౌన్సిలర్ భాగ్యలక్ష్మి, అధికారులు శ్రీనివాస్ రెడ్డి, మాధవి, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.



తొట్టిలో నిల్వ ఉన్న నీటిని పారబోస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఓర్వలేకే కాంగ్రెస్‌పై విమర్శలు

దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రుణమాఫీ చేస్తుంటే ఓర్వలేని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శలు చేస్తున్నాడని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీని హర్షం వ్యక్తం చేస్తూ, మండల కేంద్రమైన మిరుదొడ్డిలో శుక్రవారం రైతులు, కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన.. సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. మహాత్మా గాంధీ, ఇందిరా గాంధీ విగ్రహాలకు పూల మాలలు వేసి ప్రభుత్వానికి అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గం అభివృద్ధి కుంటు పడటానికి కారణమైన మాజీ మంత్రి హరీశ్‌రావు నియోజకవర్గంలో అడుగు పెడితే అడ్డుకుంటామన్నారు. రైతు రుణమాఫీ జరిగితే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్న హరీశ్ రావు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల రాజేశ్, మిరుదొడ్డి పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి, మాజీ ఎంపీపీ గజ్జెల సాయిలు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు నేరండ్ల భూమాగౌడ్, వెంకట్ గౌడ్, భూపాల్‌గౌడ్, అమర్, మాజీ సర్పంచ్ కిష్టయ్య, మహేందర్, మహేశ్, భూపతి గౌడ్, కనకారెడ్డి, రాజు, ఎల్లయ్య పాల్గొన్నారు.

అండగా ఉంటాం

మిరుదొడ్డి(దుబ్బాక): కుక్కల దాడిలో మృతి చెందిన చిన్నారి విహాన్ కుటుంబానికి కాంగ్రెస్ అండగా ఉంటుందని పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం చిన్నారి విహాన్ కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. జరిగిన విషాద సంఘటనపై అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకునేలా కృషి చేస్తానన్నారు.

సిద్దిపేటరూరల్: రూ. 2 లక్షల రుణమాఫీ చేస్తుండటంతో రైతు కళ్లల్లో సంతోషం కనిపిస్తోందని కాంగ్రెస్ సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి హరికృష్ణ అన్నారు. శుక్రవారం చిన్నగుండవెల్లి, ఇర్కోడ్, నారాయణరావుపేటలో మాఫీ సంబరాల్లో ఆయన పాల్గొన్నారు. రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

పరీక్షా విధానం రద్దు చేయాలని..

ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ఆశావర్కర్ల ధర్నా

దుబ్బాకటౌన్: తమకు నష్టం కలిగించే పరీక్షా విధానాన్ని ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షుడు గొడ్డుబర్ల భాస్కర్ మాట్లాడారు. ఆశలకు కనీస వేతనం రూ.18 వేలు చెల్లించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులపాటు వారు నిరవధిక సమ్మె చేస్తే నాటి హెల్త్ డైరెక్టర్ శ్రీనివాస్‌రావు హామీలు నెరవేరుస్తామని మాట ఇచ్చారన్నారు. కానీ నేటి వరకు దాన్ని గురించి పట్టించుకున్న వారు ఎవరూ లేరని మండిపడ్డారు. ఎన్నికల ముందు వేతనాలు పెంచుతామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కూడా దాని ఊసెత్తడం లేదన్నారు. ఆశలకు నష్టం కల్గించే పరీక్షా విధానం తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని లేకుంటే ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ప్రభుత్వంపై ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఒత్తిడి తీసుకురావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పీఏ జనార్దన్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు భాస్కర్, ఆశా వర్కర్లు భాగ్యలక్ష్మి, శారద, సంతోష, చంద్రకళ, బాబాయ్, స్వరూప, భారతీలత, తదితరులున్నారు.



ఎమ్మెల్యే కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ, ఆశా వర్కర్లు

ఎనిమిదేళ్ల తర్వాత స్కూల్ పునఃప్రారంభం



చౌటకుంట తండాలో పునఃప్రారంభమైన ప్రాథమిక పాఠశాల

ఆ స్కూల్ ఎనిమిదేళ్ల తర్వాత పునః ప్రారంభించారు. విద్యార్థులు లేక మొన్నటి వరకు మూత పడింది. అయితే బడిబాట ద్వారా తండావాసులు ముందుకొచ్చి పిల్లలను చేర్పించారు. ఇప్పుడు ఏకోధ్యాయుడైన మధుమూర్తి బోధన చేస్తున్నారు. కానీ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరగా అంగన్‌వాడీలో కొనసాగుతోంది. ఒకే గదిలో అంగన్‌వాడీ చిన్నారులు ఆరుగురు, పాఠశాలకు చెందిన 14 మంది పిల్లలు ఉన్నారు. ఇది చౌటకుంట తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పురోగతి. – అక్కన్నపేట(హుస్నాబాద్)

నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

హుస్నాబాద్: అంగన్‌వాడీ పిల్లలకు నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించాలని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని 2వ వార్డులో ఉన్న అంగన్ వాడీ కేంద్రంలో శుక్రవారం సఫాయి అప్నే బీమారి భగావో నిర్వహించారు. అంగన్‌వాడీ ఆవరణలో ఉన్న గడ్డిని తొలగించి ట్రాక్టర్‌లో డంపింగ్ యార్డుకు తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ స్కూళ్లతో పాటు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. నాణ్యత కలిగిన ఆహారాన్ని అందించి, దోమలు పెరగకుండా నిల్వ ఉన్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని కోరారు. వ్యక్తిగత శుభ్రత చాలా అవసరమని, పిల్లలందరూ చేతులను శుభ్రంగా కడుక్కోవాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కమిషనర్ మల్లికార్జున్, కౌన్సిలర్ రమాదేవి, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గౌరవెల్లి, కుందనవానిపల్లి గ్రామ పరిధిలోని చౌటకుంట తండాలో అమ్మ మాట అంగన్వాడీ బాట ర్యాలీ నిర్వహించారు. గండిపల్లి సెక్టర్ సూపర్‌వైజర్ సుజాత మాట్లాడుతూ, మూడు సంవత్సరాల లోపు పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. బాల్యంలోనే విద్యపై ఆకర్షితులయ్యే విధంగా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో టీచర్లు మాచర్ల రాజేశ్వరి, మంద లక్ష్మీ, సరోజన, ఉపాధ్యాయులు నోముల చంద్రారెడ్డి, జంగపల్లి వెంకట నర్సయ్య, రమణ, గుగులోతు శంకర్, మధుమూర్తి పాల్గొన్నారు.



హుస్నాబాద్: పిల్లలతో మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

సంక్షిప్త వార్తలు

18,101 మందికి లబ్ధి

కోహెడ(హుస్నాబాద్): రైతుల సంక్షేమానికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని మాజీ సర్పంచ్ దొమ్మాట జగన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో రూ.106 కోట్ల 74 లక్షలు రుణమాఫీ జరిగిందన్నారు. 18,101 రైతు కుటుంబాలు లబ్ధి పొందాయన్నారు. రాష్ట్రస్థాయిలోనే హుస్నాబాద్ రుణమాఫీలో రెండో స్థానంలో నిలిచిందన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మేదినీపూర్‌లో డ్రై డే..

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం మేదినీపూర్‌లో శుక్రవారం డ్రై డే నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ప్రత్యేకాధికారి, పీహెచ్‌సీ వైద్యురాలు ఫరీన్ హాజరయ్యారు. ప్రజల ఇళ్ల పరిసరాలను పరిశీలించారు.

భవిష్యత్‌కు పునాది చదువు, సంస్కారం

సిద్దిపేటజోన్: ప్రతీ ఒక్కరి భవిష్యత్‌కు చదువు, సంస్కారం పునాది లాంటిదని, క్రమశిక్షణతో గురువులను గౌరవించాలని మహిళ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ దుర్గ సూచించారు. శనివారం ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థులకు మహిళ రక్షణ చట్టాలు, షీ టీమ్స్ విధులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుకునే వయసులో చెడు తోవలో వెళ్లకూడదన్నారు. డ్రగ్స్, మత్తు పదార్థాల జోలికి కూడా వెళ్లొద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ఎప్పటికప్పుడు గమనిస్తుండాలని చెప్పారు. డ్రగ్స్‌పై సమాచారం ఉంటే పోలీసులకు తెలపాలన్నారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్ చారి, పోలీస్ సిబ్బంది, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

తొలివిడతలో రూ.లక్ష రుణమాఫీ అయిన సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు క్షీరాభిషేకం నిర్వహించారు. ఆయా చోట్ల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై స్వీట్లు పంపిణీ చేశారు. పలు ప్రాంతాల్లోని రైతులకు చెక్కులను అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. – నెట్‌వర్క్



వర్గల్(గజ్వేల్): మైలారంలో..



సిద్దిపేటరూరల్‌లో..



చిన్నకోడూరు(సిద్దిపేట)లో..



సిద్దిపేటరూరల్: నారాయణరావుపేటలో..